# ఇసుక తోడేస్తున్నారు



ఆదిలాబాద్ మండలం తంతోలి వాగులో నీళ్లలో మునిగి ఇసుకను తోడేస్తున్న కూలీలు

తాంసి మండలం హస్నాపూర్, ఘోట్కురి, వడ్డాడి, తలమడుగు, ఆదిలాబాద్ మండలం పొచ్చర, తంతోలి, భీంపూర్ మండలం సంటర్ సాంగ్వి, అందర్‌బంద్, జైనథ్ మండలం భోరజ్, తర్నం, జైనథ్ వాగుల్లో ఇసుకను తోడేస్తున్నారు. ప్రమాదకరంగా కూలీలు నీళ్లల్లో మునిగి తీసిన ఇసుకను ట్రాక్టర్లలో నింపి వ్యాపారులు రూ.3,500 నుంచి రూ.4 వేల వరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుకను తోడేయడంతో భూగర్భజలాలు త్వరగా ఇంకిపోయి, వేసవి రాకమునుపే వాగులు, ఒర్రెలు ఎండిపోతున్నాయి. రైతులు పంటలకు నీటి తడులు ఇవ్వడానికి, పశువుల తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

- న్యూస్‌టుడే తాంసి



హస్నాపూర్ వాగులో ఇసుకను బయటకు తీస్తున్న కూలీలు

# అండగా చట్టాలు.. ఆపదలో నేస్తాలు

● నేడు అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం



అనారోగ్యం, వృద్ధాప్యంతో బాధపడుతున్న మందమర్రికి చెందిన లక్ష్మి (70)ని కూతురు, అల్లుడు చూడడం లేదని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్‌కు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసింది. లక్ష్మి భర్త పోశం సింగరేణి కార్మికునిగా పనిచేస్తున్న క్రమంలో చనిపోయాడు. ఆమెకు ముగ్గురు కూతుళ్లు. కాగా అందరి పెళ్లిలు చేసింది. లక్ష్మి బాధ్యతలు చిన్నకూతురు మరియమ్మ అల్లుడు జాని చూసుకుంటానని చెప్పడంతో పోశం సింగరేణి ఉద్యోగాన్ని కారుణ్య నియామకం కింద ఇచ్చింది. కొన్ని నెలలుగా వారు పట్టించుకోకపోవడంతో పాటు తిడుతుండడంతో కలత చెందిన బాధితురాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా మహిళా శిశు, దివ్యాంగ, వృద్ధుల సంక్షేమశాఖ అధికారులు ఆమెను శ్రీ సాయి వృద్ధాశ్రమంలో చేర్పించారు.

**అల్లారుముద్దుగా పెంచిన తల్లిదండ్రుల బాగోగులు చూడటంలో కొందరు పిల్లలు నిర్లక్ష్యం చేస్తున్నారు. చిన్న చిన్న కారణాలతో అనాథలుగా రోడ్డున పడేస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని వయోవృద్ధుల సంరక్షణ, పోషణ బాధ్యతల విషయంలో ప్రభుత్వం ప్రత్యేకంగా చట్టాలు తీసుకొచ్చింది. హక్కులు కాపాడటం, రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలపై అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా కథనం.**


**ఉమ్మడి జిల్లాలో**
**వయోవృద్ధుల కుటుంబాలు : 1,580**
**వృద్ధాశ్రమాలు : 5**



మందమర్రి పట్టణం, ఆదిలబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే

### చట్టం ఏం చెబుతుందంటే..

- తల్లిదండ్రులను పోషించడానికి, వారి సంరక్షణ చర్యలు తీసుకోవడానికి పిల్లలు ముందుకు రాకుంటే ఆర్డీవోకు ఫిర్యాదు చేయాలి.
- 57 సంవత్సరాలు దాటిన వారు సీనియర్ సిటిజన్‌గా ప్రభుత్వం ప్రకటించింది.
- ఆర్డీవో కార్యాలయాల్లో సీనియర్ సిటిజన్ల విజ్ఞప్తుల పరిష్కారానికి ప్రత్యేకంగా న్యాయ సహాయ కేంద్రాలు (ట్రైబ్యునళ్లు) ఏర్పాటు చేశారు.
- ఫారం-ఏ నింపి దరఖాస్తును ఆర్డీవోకు ఇస్తే వారి స్థిర చరాస్తులు గతంలో పిల్లల పేరిట రిజిస్ట్రేషన్ చేసినప్పటికీ వాటిని రద్దు చేసి తిరిగి తల్లిదండ్రులకు ఇచ్చే అధికారాన్ని చట్టం కల్పిస్తోంది.
- వారికి ఆహారం, దుస్తులు, నివాసం, మందుల ఖర్చులు భరించాలి. లేని పక్షంలో పోషణకు నెలకు రూ.10 వేలు చెల్లించాలి.
- 2007 చట్ట సవరణ ప్రకారం కొడుకులతో పాటు కూతుళ్లు, అల్లుళ్లు, కోడళ్లు, మైనార్టీ తీరిన మనుమలు, మనుమరాళ్లు కూడా వారి బాధ్యత స్వీకరించాలి.
- దరఖాస్తుల పరిష్కారానికి రెండు నెలల గడువు విధించారు. ప్రత్యేక పరిస్థితుల్లో గడువును ఒక్కసారి మరో 30 రోజులు పొడిగించేందుకు విచారణాధికారికి వీలుంటుంది.





### జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీ

సీనియర్ సిటిజన్ల సంరక్షణ, పోషణకు జిల్లా స్థాయిలో కమిటీ ఉంటుంది. జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా జిల్లా ఎస్పీ, జిల్లా వైద్యాధికారి, డీఆర్‌డీఓ, ఆర్డీవో, సీనియర్ సిటిజన్ ఫోరం, ఎన్జీవోల నుంచి ఒక మహిళతో సహా ముగ్గురు వయోవృద్ధులు, జిల్లా వికలాంగుల, వయోవృద్ధుల సంరక్షణాధికారులు సభ్యులుగా ప్రత్యేక కమిటీ ఉంటుంది. సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడంలో ఆయా సభ్యులు కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది.

### సంరక్షణ కోరుకునే వారు ఏం చేయాలంటే...

పిల్లలు తమను సంరక్షించకుంటే వారు ఆర్డీవో వద్దకు వెళ్లి ఫారం -ఏ నింపి అందజేయాలి. దీనికి న్యాయవాదితో కూడా అవసరముండదు. అధికారులు తగిన సహకారం అందిస్తారు. అనంతరం ఆర్డీవో విచారణ నిర్వహించి పోలీసులకు తదుపరి చర్యల కోసం రాసే అవకాశం ఉంటుంది. లోక్ అదాలత్‌లో అర్జీ ఇవ్వగలిగితే న్యాయ సేవా సాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా న్యాయమూర్తి చర్యలకు ఆదేశాలు ఇచ్చే అవకాశముంది. మానవ హక్కుల కమిషన్ ద్వారా కూడా ఉపశమనం పొందే వీలు ఉంటుంది.



### అక్కున చేర్చుకుంటున్న వృద్ధాశ్రమాలు

కుటుంబ సభ్యుల నుంచి గెంటివేసిన, నిరాదరణకు గురైన, వీధిన పడిన వృద్ధులను వృద్ధాశ్రమాలు అక్కున చేర్చుకుంటున్నాయి. వారికి అన్నివిధాలా సేవలు అందిస్తూ ఆత్మీయుల్లా చూసుకుంటున్నాయి.



**టోల్‌ఫ్రీ నెంబరు.. అందించే సేవలు**

- వృద్ధాప్యంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను నేరుగా 14567 అనే హెల్ప్‌లైన్ ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లొచ్చు.
- మానసిక ఇబ్బందులు ఉన్నవారు సాయం పొందవచ్చు. నడవలేని వారికి చక్రాల కుర్చీలు, చేతికర్రలు సమకూరుస్తారు.
- వయోవృద్ధుల ఫిర్యాదులు స్వీకరించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సై స్థాయి వ్యక్తిని ప్రత్యేక అధికారి నియమించారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసినా, వారి పట్ల అనుచితంగా ప్రవర్తించినా వారికి ఆరు నెలల నుంచి గరిష్ఠంగా 2 సంవత్సరాల జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. రూ.10 వేల వరకు జరిమానా విధించేలా చట్టం రూపొందించారు.

# హౌసింగ్‌బోర్డు భూమిని మింగేశారు





న్యూస్‌టుడే, ఆదిలాబాద్ పట్టణం

**మధ్య తరగతి ప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు తక్కువ ధరతో ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు ఏర్పాటుచేసిన ప్రభుత్వ గృహ నిర్మాణ మండలి (హౌజింగ్‌బోర్డు)కు సంబంధించి 6 ఎకరాల భూమిని స్థిరాస్తి వ్యాపారులు మింగేశారు. రెవెన్యూ అధికారులకు తెలిసినా మౌనంగా ఉండడమే విమర్శలకు తావిస్తోంది. ఆ భూమిలో స్థిరాస్తి వ్యాపారులు దర్జాగా ఇంటి నిర్మాణాలు సైతం చేపడుతున్నారు.**

జిల్లా కేంద్ర పరిధిలోకి వచ్చే మావల మండల బట్టిసావర్గాం శివారు పరిధిలో హౌజింగ్‌బోర్డుకు స్థలాన్ని కేటాయించారు. బట్టిసావర్గాం శివారు సర్వే నెం.72/2/2లో 35.04 ఎకరాలు, సర్వే నెం.72/1/2లో 19.24 ఎకరాలు, సర్వే నెం.72/40లో 0.24 ఎకరాల అసైన్డ్ భూమితో పాటు అదే సర్వే నెంబరు పరిధిలోని 21.06 ఎకరాల పట్టాభూమిని జిల్లా అధికార యంత్రాంగం సేకరించింది. మొత్తం 76.18 ఎకరాలను 1989లో జిల్లా అధికారులు మండలి(హౌజింగ్‌బోర్డు)కి అప్పగించగా 1993లో అక్కడ నిర్మాణాలు ప్రారంభించారు.

### వివాదాస్పద స్థలంలో ఇళ్ల నిర్మాణాలు

ప్లాట్ల విక్రయాల సమయంలోనే అక్కడ కొంత వివాదం నెలకొనగా తాజాగా అక్కడ ఇళ్ల నిర్మాణాలు సైతం కొనసాగిస్తున్నారు. ఇప్పటికే కొన్ని నివాసాలు పూర్తి కావొస్తుండగా మిగతా కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. ఇతర పట్టాపత్రాలు చూపించడంతో పురపాలక కార్యాలయం నుంచి నిర్మాణ అనుమతులకు ఎలాంటి అడ్డంకులు ఉండటం లేదు. వాస్తవానికి రెవెన్యూ అధికారులదే ఇందులో కీలకపాత్ర. ఎవరి భూమి ఎక్కడుందనేది తేల్చాల్సింది ఆ శాఖనే. ఒక వేళ ప్రైవేటు వ్యక్తులు తమ స్థలమని పాగావేస్తే మరి హౌసింగ్‌బోర్డుకు చెందిన భూమి ఎక్కడుందో చూపించాలి. కానీ అదీ లేదు. ఫలితంగా విలువైన స్థలం కాస్త అన్యాక్రాంతమవుతోంది.

☛ ఈ విషయమై ఆదిలాబాద్‌లో సుదీర్ఘ కాలం హౌజింగ్ డీఈగా పని చేసి ఈఈగా పదోన్నతిపై వెళ్లిన బాలునాయక్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించింది. గతంలో అధికారులు మండలికి అప్పగించిన రికార్డుల ప్రకారమే 6 ఎకరాల స్థలం మిగిలి ఉందని వివరించారు. స్థలం కబ్జాపై జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులకు పలుమార్లు నివేదించానని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందిస్తే మండలికి ఆ స్థలం వస్తుందని తెలిపారు.

### ఇతర పట్టాతో పాగావేసి

న్యూహౌజింగ్ బోర్డుగా రూపుదిద్దుకున్న ఆ కాలనీలో స్థిరాస్తి ధరలు విపరీతంగా పెరిగాయి. సర్వే నెం.72/2/2 పరిధిలో 35.04 ఎకరాల్లో ఇళ్ల నిర్మాణాలు పోనూ 6 ఎకరాల స్థలం మిగిలి ఉంది. డిమాండ్ పెరగడంతోనే ఆ ఖాళీ స్థలంలో కొందరు ఇతర పట్టాతో పాగావేశారు. వారికి రెవెన్యూ అధికారులు వంతపాడారు. పదేళ్ల కిందట జరిగిన ఈ వ్యవహారంలో మండల అధికారులు న్యాయపరంగా పోరాటం మొదలెట్టారు. ఈ పోరాటం నడుస్తుండగానే స్థిరాస్తి వ్యాపారులు అక్కడ ప్లాట్లు విక్రయించారు. ప్రస్తుతం అక్కడ ఎకరానికి రూ.4 కోట్ల వరకు డిమాండ్ పలుకుతుండటంతో రూ.24 కోట్ల స్థలం మింగేసినట్లు తెలుస్తోంది.

# ఫలించిన నిరుద్యోగుల ఆశలు

● జిల్లాలో 324 పోస్టులకు 1:3 అభ్యర్థుల ఎంపిక

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే

నిరుద్యోగులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న డీఎస్సీ-2024 పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. జిల్లాలో 1:3 నిష్పత్తిలో 324 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయగా.. మంగళవారం నుంచి డైట్ కళాశాలలో వారి ధ్రువపత్రాల పరిశీలన జరగనుంది.

ఏడాది కిందట సెప్టెంబరులో గత ప్రభుత్వం 275 పోస్టులతో డీఎస్సీ ప్రకటన విడుదల చేయగా కాంగ్రెస్ ప్రభుత్వం మరో 49 పోస్టులను జత చేస్తూ కిందటి ఫిబ్రవరి 29వ తేదీన 324 పోస్టులతో మరో నోటిఫికేషన్ జారీ చేసింది.

### భర్తీకానున్న పోస్టులు

జిల్లాలో మొత్తం 324 పోస్టుల్లో 74 స్కూల్ అసిస్టెంటు, 14 లాంగ్వేజ్ పండితులు, రెండు పీఈటీలు భర్తీ కానుండగా అత్యధికంగా 209 సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) పోస్టులు భర్తీ కానున్నాయి. ఈ సారి కొత్తగా ప్రత్యేకావసర పిల్లల బోధనకు స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులను నోటిఫై చేశారు. ఇందులో ఆరు స్కూల్‌అసిస్టెంటు, 19 ఎస్జీటీ పోస్టులు భర్తీ చేయనున్నారు.




### కేటగిరీ వారీగా భర్తీ ఇలా..

జిల్లాలో మొత్తం 324 పోస్టులు ఉండగా అందులో ఓపెన్ కేటగిరి(ఓసీ) కింద-106, ఎస్సీ-59, ఎస్టీ-25, బీసీ(ఎ)-38, బీసీ(బీ)-17, బీసీ(డీ)-20, బీసీ(ఈ)-05, పీహెచ్-18, ఇడబ్లుఎస్-19, స్పోర్ట్స్ కోటా-02, ఎక్స్‌సర్వీస్‌మెన్-06 పోస్టులు భర్తీ కానున్నాయి. ఇందులో ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున మొత్తం 972 మంది సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకానున్నారు.

### నేటి నుంచి 'డైట్'లో ధ్రువపత్రాల పరిశీలన

డీఎస్సీ-2024లో 1:3 ప్రాతిపదికన ఎంపికైన అభ్యర్థులకు సందేశం, ఈ-మెయిల్ ద్వారా సమాచారం వస్తుందని, వారు మాత్రమే మంగళవారం నుంచి ప్రారంభమయ్యే ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాలని డీఈవో ప్రణీత తెలిపారు. ఈ నెల అయిదో తేదీ వరకు పట్టణంలోని డైట్ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతుందని పేర్కొన్నారు.

# సందడిగా రిమ్స్





**రిమ్స్ వైద్య కళాశాలలో సోమవారం రాత్రి ఘనంగా స్వాగతోత్సవాన్ని నిర్వహించారు. 2022 బ్యాచ్ విద్యార్థులు 2023 బ్యాచ్ వైద్య విద్యార్థులకు స్వాగతం పలుకుతూ రిమ్స్ ఆడిటోరియంలో ఆడిపాడారు. నృత్యాలు చేస్తూ సందడిగా గడిపారు. రిమ్స్ సంచాలకుడు రాథోడ్ జైసింగ్, వైస్ ప్రిన్సిపల్ విద్యా విల్సన్ తదితరులు ఉన్నారు.**

- ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే



### ముందస్తు బతుకమ్మ సంబరాలు

**ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే:** ఆదిలాబాద్ గ్రామీణ మండలం మామిడిగూడ బాలికల గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో సోమవారం ముందస్తు బతుకమ్మ సంబరాలు జరుపుకొన్నారు. విద్యార్థులు తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి దానిని మధ్యలో ఉంచి డీజే పాటల మధ్య నృత్యాలు చేశారు. కొలాటాలు చేస్తూ సందడి చేశారు. ప్రధానోపాధ్యాయురాలు శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతేరాజు 8లో

### జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

**ఇచ్చోడ(నేరడిగొండ), న్యూస్‌టుడే :** నేరడిగొండ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు చెందిన స్పందన బేస్‌బాల్ పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. సెప్టెంబరు 14 నుంచి 15 వరకు నిర్మల్‌లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచారు. అక్టోబరు 2 నుంచి 6 వరకు పంజాబ్‌లో నిర్వహించే 32వ జాతీయ జూనియర్ బేస్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననుందని జిల్లా కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు.



# నిశిరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం

✷ నలుగురి దుర్మరణం
✷ గుడిహత్నూరు మండలం మేకలగండి వద్ద ఘటన

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే

వారంతా నిశిరాత్రి కారులో ఇంటికొస్తున్నారు. మరో 15 నిమిషాలైతే ఇంటికి చేరేవారు. ఈ క్రమంలో వారు ప్రయాణిస్తున్న కారు డివైడర్‌ను రాసుకుంటూ దూసుకెళ్లింది. అదుపు తప్పి సిమెంట్‌కాల్వలో బోల్తాపడటంతో నలుగురు దుర్మరణం చెందారు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం మేకలగండి వద్ద జాతీయ రహదారి-44 పై సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. అదుపు తప్పిన కారు డివైడర్‌ను రాసుకుని దాదాపు వంద మీటర్లు వెళ్లి ప్రమాదానికి గురైంది. అందులో ప్రయాణిస్తున్న ఎనిమిది మందిలో మోయిజ్(60), అలీ(8), ఖాజా మోయినొద్దీన్(40), మొహమ్మద్ ఉస్మానుద్దీన్(11) దుర్మరణం పాలయ్యారు. ఆయేషా ఆఫ్రీన్, ఫరీద్, ఎక్రా, సాథ్‌లు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిని సంఘటనా స్థలం నుంచి మూడు 108 అంబులెన్స్‌ల ద్వారా రిమ్స్‌కు తరలించారు. వీరంతా ఆదిలాబాద్‌కు చెందినవారే. మేకల గండి నుంచి ఆదిలాబాద్ 15 కి.మీ.దూరం. 15 నిమిషాల్లో ఇంటికి చేరే వారని అంతలోనే మృత్యువు కబళించిందని బంధువులు రోదించారు.





ప్రమాదం ఊహాచిత్రం



మృతులు




సంఘటన స్థలంలో క్షతగాత్రులు

### అరటికి ప్రత్యేక రాయితీ



ఆయిల్‌పామ్‌లో అరటిని అంతర పంటగా సాగు చేసుకోవచ్చు. ఎకరానికి 50 నుంచి 57 వరకు ఆయిల్‌పామ్ మొక్కలు సాగు చేస్తారు. అయితే అరటిని మధ్యలో ఎకరానికి 1200 వరకు మొక్కలు సాగు చేసుకోవచ్చు. దీనికి ప్రభుత్వం నుంచి ప్రత్యేక రాయితీ ఇస్తుంది. 11 నెలలకు ఒకసారి చేతికి వచ్చే అరటి వల్ల ఎకరానికి రూ. ఒక లక్ష అదనంగా ఆదాయం పొందే అవకాశముంది.

### సోయాబీన్.. గిట్టుబాటు



ఆయిల్‌పామ్‌లో సాగు చేసే మరో పంట సోయాబీన్.. మూడు నెలల పంట. దీన్ని రెండు ఆయిల్‌పామ్ సాళ్ల మధ్య ఆరు నుంచి ఏడు సాళ్లు సాగు చేయవచ్చు. ఎకరానికి 5 నుంచి 8 క్వింటాళ్ల వరకు చేతికి వస్తుంది. రూ. 30 వేల నుంచి రూ. 40 వేల వరకు అదనంగా ఆదాయం పొందే అవకాశముంది. దీని తర్వాత తిరిగి శనగను అంతర పంటగా సాగు చేసుకోవచ్చు. వీటితో పాటు పత్తి, అరటి, ఉల్లి, కూరగాయలు, కందిని అంతర పంటలుగా సాగు చేసుకోవచ్చు. ప్రధాన పంటలో మధ్యమధ్య సాళ్లలో వీటిని సాగు చేయడం వల్ల ఆయిల్ పామ్‌తో పాటు అంతర పంటలతో అదనంగా ఆదాయం పొందే అవకాశముంది

## అంతర సాగు..
# ఆదాయం బాగు..

**మంచిర్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే:** రైతులు ఇప్పుడిప్పుడే ఉద్యాన వన పంటలపై దృష్టి సారిస్తున్నారు. ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం అందిస్తుండటంతో ఉమ్మడి జిల్లాలో ఏటా సాగు పెరుగుతోంది. సాగు పెంచేందుకు రాయితీలు అందజేస్తూ ప్రోత్సహిస్తుండటంతో సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. అయితే ఇందులో అంతర పంటలు సాగు చేస్తే మరింత ప్రయోజనకరంగా ఉండటం... దీనికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుండటంతో రైతులు ఆయిల్ పామ్‌లో అంతరపంటలపై ఆసక్తి చూపుతున్నారు. ఒకే చేనులో.. ఒకే పెట్టుబడితో రెండు రకాల పంటలు పండించడం తక్కువ పెట్టుబడితో గిట్టుబాటు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. అంతరపంటలపై దృష్టి సారిస్తే మరింత దిగుబడి సాధించవచ్చని మంచిర్యాల క్లస్టర్ ఉద్యానవన అధికారి సహజ వివరించారు.

రైతేరాజు

### రాయితీ ఇలా:

రైతులు దీనిని ఎన్ని ఎకరాల్లోనైనా సాగు చేసుకోవచ్చు. ఒక మొక్క ధర రూ. 193 కాగా దీనిని రూ. 20కే అందిస్తున్నారు. ఎకరానికి 57 మొక్కలు అవసరం కాగా రైతులు ఎకరాకు రూ. 1100 చెల్లించాలి. బిందు సేద్యం రాయితీని ఒక రైతుకు పన్నెండున్నర ఎకరాలలోపు మాత్రమే అందిస్తారు. అంతర పంటలు సాగు చేస్తే మొక్కలు పెరిగే వరకు నిర్వహణకు ఎకరాకు రూ. 4200 చొప్పున నాలుగేళ్లపాటు అందిస్తారు.

### నేరుగా మిల్లుకు..



ఆయిల్‌పామ్ మధ్యలో సరుగుడు మొక్కలను ఎకరానికి రెండు వేలు నాటవచ్చు. రెండేళ్ల తర్వాత పెరిగిన చెట్ల కొయ్యలు అమ్మడం ద్వారా ఆదాయం పొందవచ్చు. వీటిని నేరుగా సిర్పూర్ కాగజ్‌నగర్‌లోని మిల్లుకు తరలిస్తే అక్కడ కొనుగోలు చేస్తారు. రవాణాతో కలిపి ఒక్కో మొక్కకు రూ. 2.50 పైసల ఖర్చు వస్తుంది. పెరిగిన తర్వాత కంపెనీ వారే రైతుల చేలల్లోకి వచ్చి ఉచితంగా చెట్లను కొట్టించి తీసుకెళ్లి పంటను బట్టి డబ్బులు అందజేస్తారు.

### రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం



**శివకృష్ణ**, వ్యవసాయ శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి.
చరవాణి సంఖ్య: 91002 29854

?: బెండలో పచ్చదోమ ఆశిస్తోంది. ఎలా నివారించవచ్చు? **శంకర్ రైతు, చింతగూడ**

✓ నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 1మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**- న్యూస్‌టుడే, దండేపల్లి**

### జీవాలలో నీలి నాలుక వ్యాధి నివారణ ఇలా..

మీకు తెలుసా?

జీవాలలో ఎక్కువగా వచ్చేది నీలి నాలుక వ్యాధి. ఇది రియోవిరిడే అనే కుటుంబానికి చెందిన వైరస్ వల్ల వ్యాపిస్తుంది. ఈ వ్యాధి వల్ల రక్త కణాలు దెబ్బ తినడంతో పాటు రక్త నాళాలు వాస్తాయని పశువైద్యాధికారి డా. ధన్‌రాజ్ పేర్కొన్నారు. దీంతో పాటు కాలి గిట్టలు వస్తాయని దీనివల్ల నడవడం ఇబ్బందిగా మారి కుంటుతాయని వివరించారు. ఈ వ్యాధి నివారణకు ఉప్పు కలిగిన గంజి, రాగి జావ, ఓఆర్ఎస్ ద్రావణం క్రమం తప్పకుండా తాగించాలని వివరించారు. దీంతో పాటు ముందస్తుగా టీకాలు వేయించాలని, వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. **- న్యూస్‌టుడే, దండేపల్లి**

## పండగల వేళ.. లాభాల బంతి

**న్యూస్‌టుడే, ఆదిలాబాద్ గ్రామీణం :** సీజన్‌కు అనుగుణంగా పంటలు సాగు చేస్తే అన్నదాతలకు ఆదాయం పెరుగుతుంది. ప్రస్తుతం బతుకమ్మ, దసరా, దీపావళి, సంక్రాంతి వరుసగా రాబోతున్నాయి. ఇప్పుడు పూలకు భలే గిరాకీ ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని బంతి సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు ఆదిలాబాద్ గ్రామీణ మండల కచ్‌కంటి గ్రామానికి చెందిన కొక్కుల సంజీవ్.

ఆదర్శం

కచ్‌కంటి గ్రామానికి చెందిన కొక్కుల సంజీవ్ పదేళ్లుగా బంతిపూలను సాగు చేస్తున్నారు. ఆరు ఎకరాలు కౌలు తీసుకొని నాలుగున్నర ఎకరాల్లో పత్తి సాగు చేశారు. మిగతా భూమిలో సంజీవ్ బంతి పూల సాగు చేపట్టారు. పండగల వేళ దిగుబడి వచ్చేలా ప్రణాళికతో పచ్చ, ఎర్ర బంతి మొక్కలు నాటారు. లక్ష పెట్టుబడిగా పెట్టగా.. విత్తనాలకు రూ.50 వేలు ఖర్చు చేశారు. నాలుగు నెలలకే దిగుబడి చేతికొచ్చింది. ఇప్పటికే వినాయక చవితి పండగకు వ్యాపారులు తోట వద్దకే వచ్చి కొనుగోలు చేశారు. ఒక్క ఎకరానికి 5 నుంచి 6 టన్నుల బంతి పూలు దిగుబడిగా వస్తున్నాయని రైతు చెబుతున్నారు. నాలుగు నెలల వ్యవధిలోనే లక్షన్నర లాభం వస్తోందని ఆనందంగా చెబుతున్నారు. పదేళ్లుగా బంతిపూలు సాగు చేస్తున్నాను. వ్యాపారులు తోట వద్దకే రావడం.. స్థానిక మార్కెట్‌లోనే పూలను విక్రయించడంతో రవాణా ఖర్చులు లేకపోవడంతో అనుకున్నంత లాభం వస్తోంది. దసరా, దీపావళికి పూల ధరలు పెరగడంతో మరింత మెరుగైన ఆదాయం వస్తోందని అంటున్నారు.



సంజీవ్ సాగు చేస్తున్న బంతి తోట

## భారీగా ఆశలు తీరాలి బాధలు






పెన్‌గంగపై నిర్మాణంలో ఉన్న చనాఖా కొరాట రిజర్వాయర్

**ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే :** ప్రాజెక్టుల్లో 75 శాతం, అంతకన్నా ఎక్కువ నిర్మాణం పూర్తయిన వాటికి అవసరమైన నిధులిచ్చి పనులు పూర్తి చేసి సాగు నీరు అందించే ప్రాజెక్టులు ఉమ్మడి జిల్లాలో అయిదు ఉన్నట్లు గుర్తించారు. మొదటి కేటగిరీలో నాలుగు ప్రాజెక్టులుండగా రెండో కేటగిరీలో ఒక ప్రాజెక్టు ఉంది. ప్రస్తుతం రూ. 167.83 కోట్లు మంజూరు చేస్తే వచ్చే వానాకాలంలో 28 వేల ఎకరాలకు సాగు నీరందుతుందని నీటి పారుదలశాఖ అధికారులు ప్రతిపాదించడంతో నిధుల విడుదలకు సీఎం అంగీకరించడంతో ఆశలు చిగురించాయి.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 18కిపైగా ప్రాజెక్టులు ఉన్నా వీటిలో చాలా వరకు కొద్ది మొత్తంలో పనులు అసంపూర్తిగా ఉండటంతో ఆయకట్టుకు సాగు నీరందడం లేదు. తక్కువ ఖర్చుతో వానాకాలం సీజన్‌లో సాగు నీటిని అందించే ప్రాజెక్టులను గుర్తించాలని ప్రభుత్వం ఆదేశించడంతో నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం పిప్రి ఎత్తిపోతల పథకం, సదర్మాట్‌తోపాటు మంచిర్యాల జిల్లాలో నీల్వాయి ప్రాజెక్టు, ఆదిలాబాద్ జిల్లాలోని మత్తడివాగు ప్రాజెక్టులను ప్రతిపాదించారు.

### రెండో కేటగిరీలో పెన్‌గంగ

లోయర్ పెన్‌గంగ ప్రాజెక్టు కింద 50,800 ఎకరాలకు సాగు నీరు అందాలి. ప్రాజెక్టు పరిధిలో చనాఖా కొరాట రిజర్వాయర్ పనులు చివరి దశలో ఉన్నాయి. మిగిలిన పనులు పూర్తి చేస్తే వచ్చే వానాకాలం సీజన్‌లో 27,794 ఎకరాలకు సాగు నీరందించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇందుకు రూ. 147.23 కోట్లు అవసరం. ప్రతి నెల ఎంత మొత్తం అవసరమో అంచనాకు రావడంతో పాటు ఈ నిధులను క్రమం తప్పకుండా ఇవ్వాలని, అప్పుడే లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయగలుగుతామని నీటి పారుదల శాఖ అధికారులు అంటున్నారు.

**ఉమ్మడి జిల్లాలో గుర్తించిన ప్రాజెక్టులు, నిధుల అవసరం, సాగులోకి వచ్చే ఎకరాలు**

| ప్రాజెక్టు | నిధులు | ఎకరాలు |
|---|---|---|
| లోయర్ పెన్‌గంగ | 147.23 | 27,794 |
| మత్తడివాగు | 4.39 | 1,200 |
| సదర్మాట్ | 97.37 | 18,016 |
| పిప్రి | 49.07 | 4,214 |
| నీల్వాయి | 17.00 | 5,000 |

● నిర్మల్, జగిత్యాల జిల్లాలకు మేలు చేసే సదర్మాట్ ప్రాజెక్టు చివరి దశలో ఉంది. రూ. 97.37 కోట్లు వెచ్చిస్తే 18 వేల ఎకరాలకు సాగు నీరందుతుంది. దీనికి విద్యుత్తు సౌకర్యం కల్పించాల్సి ఉంది. ప్రాజెక్టు పనులు పూర్తయితే నిర్మల్ జిల్లాలో 13,120 ఎకరాలు, జగిత్యాల జిల్లాలో 4,896 ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

● మంచిర్యాల జిల్లా పరిధిలోని నీల్వాయి ప్రాజెక్టు ఎడమ కాలువ పనులు అటవీశాఖ అభ్యంతరాలతో నిలిచిపోయాయి. ఇటీవల రూ.50 లక్షలు అటవీశాఖకు చెల్లించడంతో అనుమతులు వచ్చే వీలుంది. రూ. 17 కోట్లు మంజూరు చేస్తే ఎడమ కాలువ కింద 5 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

● ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం మత్తడివాగు ప్రాజెక్టు కింద కాలువలు లేకుండా సాగు నీరు అందించేందుకు వీలుగా పనులు పూర్తికాగా కొన్ని పనులు చివరి దశలో ఉన్నాయి. వీటికి రూ. 4.39 కోట్లు విడుదల చేస్తే అదనంగా మరో 1200 ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

● నిర్మల్ జిల్లాలోని లోకేశ్వరం మండలం పిప్రి ఎత్తిపోతల పథకం పరిధిలో మోటార్లు, పైప్‌లైన్, విద్యుత్తు సౌకర్యం తదితర వాటిని పూర్తి చేయాల్సి ఉంది. రూ. 49.07 కోట్లు మంజూరు చేస్తే 4,214 ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

## సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయండి

### ట్రైకార్ రాష్ట్ర ఛైర్మన్ బెల్లయ్య నాయక్



మంజూరు పత్రం అందజేస్తున్న ట్రైకార్ ఛైర్మన్ బెల్లయ్యనాయక్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు,అనిల్ జాదవ్, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

**ఉట్నూరు, ఇంద్రవెల్లి న్యూస్‌టుడే :** గిరిజనులకు సంక్షేమ పథకాలు అందేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని గిరిజన కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ బెల్లయ్య నాయక్ ఆదేశించారు. సోమవారం ఉట్నూరు పీఎమ్మార్సీలో ఖానాపూర్, బోథ్ ఎమ్మెల్యేలు వెడ్మబొజ్జు, అనిల్ జాదవ్, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తాలతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందించేందుకు క్షేత్రస్థాయి నుంచే ఎంపికను చేపట్టాలన్నారు. పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ జరిగేలా చూడాలన్నారు. నిరుద్యోగ గిరిజన యువతకు ఉపాధి కల్పించేందుకు చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన సహకారం అందించి ప్రోత్సహించాలన్నారు. అనంతరం గిరిజన లబ్ధిదారులకు ఆర్థిక సహాయ పథకాల మంజూరు పత్రాన్ని అందజేశారు. అంతకు ముందు ఇంద్రవెల్లి రైతు ఉత్పాదక జిన్నింగ్ మిల్లును పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లి దేశంలో ఆదర్శ జిన్నింగ్‌గా తీర్చిదిద్దడానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి కృషి చేస్తామని ఆయన అన్నారు. నాగోబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంద్రవెల్లి గిరిజన అమరవీరులకు నివాళులర్పించారు. సేంద్రియ ఎరువుల ద్వారా కూరగాయలు సాగు చేస్తే వారికి రాష్ట్ర రాజధానిలో మార్కెటింగ్ సౌకర్యం కల్పించడానికి ట్రైకార్‌తో పాటు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓలు కృషి చేస్తారన్నారు. ఏపీఓ(జనరల్) జాదవ్ వసంత్‌రావు, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ, ట్రైకార్ జీఎం శంకర్‌రావు, లక్ష్మిప్రసాద్, ఈఈ రాఠోడ్ భీంరావు, వసంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఎడ్లబండిపై తీసుకొచ్చి.. అభిమానాన్ని చాటి



ఉపాధ్యాయురాలిని తీసుకొస్తున్న విద్యార్థులు

**చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే :** మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని కొమ్మెర జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సాంఘీకశాస్త్రం ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తించిన గోసంగారి విజయలక్ష్మి సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఇంతకాలం పాఠాలు బోధించిన ఉపాధ్యాయురాలు విరమణ పొందడంతో విద్యార్థులు వినూత్న రీతిలో స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఎడ్లబండిని అందంగా అలంకరించి అందులో ఉపాధ్యాయురాలిని కూర్చోబెట్టి పూలు చల్లుతూ పాఠశాల వరకు విద్యార్థులే తీసుకొచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రాధాకృష్ణమూర్తి, ప్రధానోపాధ్యాయుడు ప్రకాష్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అలేఖ్య ఆసనాలకు.. పతకాలు ఫిదా

### ● జాతీయ స్థాయిలో రాణింపు

**గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే :**

**కఠినమైన ఆసనాలను సులభంగా సాధన చేస్తూ రాణిస్తున్నారీ యువతి. జాతీయస్థాయిలో పతకాల పంట పండించడంతోపాటు న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తున్నారు. ఇలా తన ప్రతిభతో నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు గోలేటికి చెందిన కేసరి అలేఖ్య.**



ఏరియల్ యోగా చేస్తున్న అలేఖ్య

రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్‌కు చెందిన కేసరి ఆంజనేయులు గౌడ్, పద్మ కుమార్తె అలేఖ్య యోగాలో ప్రతిభ కనబరుస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. గోలేటిలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో పది వరకు చదువుకున్న ఆమె హనుమకొండలో ఇంటర్, డిగ్రీ కోర్సులను పూర్తి చేశారు. బెంగళూరులో యోగా ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకుని, ఎన్ఐఎస్‌లో యోగా కోర్సు, చెన్నైలో ఎంఎస్సీ(యోగా) చదివారు. తమిళనాడులోని మీనాక్షి అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ పూర్తి చేశారు. జల, ఏరియల్, ప్రెగ్నెన్సీ, కిడ్స్ యోగా ఇలా ఒక్కొక్క దాంట్లో ప్రత్యేక శిక్షణ తీసుకొన్నారు. ప్రభుత్వ కొలువు సాధించాలనే లక్ష్యంతో 2023లో బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సు పూర్తి చేశారు. రాష్ట్ర, జాతీయ స్థాయి రెఫరీగా పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించారు. ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించారు. జాతీయ స్థాయి పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించే స్థాయికి ఎదిగారు.



యోగా శిక్షణ ఇస్తున్న అలేఖ్య

### తల్లిదండ్రుల ప్రోత్సాహం..

అలేఖ్య ఇంటర్ చదువుతున్న రోజుల్లో కొంత అనారోగ్యానికి గురైంది. అప్పటికే బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగా శిబిరంలో యోగా నేర్చుకుంటున్న తండ్రి ఆంజనేయులుగౌడ్ విషయం తెలుసుకుని కుమార్తెను యోగాపై ఆసక్తి కలిగించేలా ప్రోత్సహించారు. గోలేటిలోని సీఈఆర్ క్లబ్‌లో ఉచితంగా నేర్పిస్తున్న యోగా శిక్షణలో చేరారు. కఠోర సాధన చేస్తూ ఆసనాలు చేయడం ప్రారంభించారు. 13 ఏళ్లుగా నిత్యం సాధన చేయడంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. 'వయసుతో నిమిత్తం లేకుండా ఎవరైనా యోగా సాధన చెయొచ్చు. సంపూర్ణ ఆరోగ్యంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుంది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఎనిదేళ్లుగా సాధన చేస్తున్నా. అమెరికా, దుబాయ్, సింగపూర్, మలేషియా దేశాలకు చెందిన విద్యార్థులకు ఆన్‌లైన్‌లో క్లాసులు నిర్వహిస్తున్నా. అంతర్జాతీయ స్థాయి యోగా శిక్షకురాలిగా ఎదగాలనేది నా లక్ష్యం' అని అలేఖ్య అన్నారు.

### న్యాయనిర్ణేత స్థాయికి..

- 2016 సంవత్సరంలో కోల్‌కత్తాలో జరిగిన జాతీయస్థాయి యోగా పోటీలో పతకం సాధించారు.
- 2017లో హైదరాబాద్, మంచిర్యాల, నిజామాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సొంతం చేసుకున్నారు.
- 2018 విజయవాడలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రానికి పతకం తీసుకొచ్చారు.
- 2019లో నాగ్‌పూర్, 2020లో బెంగళూరులో జరిగిన పోటీల్లో నోబుల్ వరల్డ్ రికార్డుల్లో పాల్గొన్నారు.
- గత నెల 23-27 వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన జాతీయస్థాయి ఆలిండియా పోలీసు గేమ్స్‌లో రెఫరీగా వ్యవహరించారు.



## కేంద్రంలో భాజపా ప్రభుత్వం కూలుతుంది : రవి



మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి

**ఆదిలాబాద్ అర్బన్:** కేంద్రంలో భాజపా ప్రభుత్వం త్వరలో కూలుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అవుతారని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. మహారాష్ట్రలో జరగనున్న శాసనసభ ఎన్నికల నేపథ్యంలో యావత్మాల్ జిల్లాకు పార్టీ పరిశీలకుడిగా నియమితులైన ఆయన మహారాష్ట్రకు వెళ్తూ ఆదిలాబాద్ పట్టణంలో ఆగారు. కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

## ఆస్తి తగాదాలతో మహిళ హత్య

**మంచిర్యాలనేరవిభాగం:** ఆస్తి తగాదాలతో ఓ మహిళ హత్యకు గురైనట్లు పోలీసులు తెలిపారు. పట్టణ సీఐ బన్సీలాల్ కథనం మేరకు.. పట్టణంలోని మేదరివాడలో సోమవారం మధ్యాహ్నం చింత విజయలక్ష్మి (47) అనుమానాస్పదస్థితిలో మృతిచెందినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించగా మృతురాలి శరీరంపై తీవ్రమైన గాయాలు ఉన్నాయి. చేతులు, మెడపై బలంగా దాడి చేయడంతోనే ఆమె చనిపోయినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు. కొంత కాలంగా తమ బంధువులతో ఆస్తి తగాదాలు ఉన్నాయని, వారే హత్య చేసి ఉంటారని మృతురాలి కూతురు రాపాల భవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు. మృతురాలి భర్త రామ్‌శంకర్ కొన్ని సంవత్సరాల క్రితమే మృతి చెందాడు.



విజయలక్ష్మి

## రాష్ట్ర స్థాయిలో ప్రతిభ.. జాతీయ స్థాయికి ఎంపిక

**మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే :** యోగాసన, స్పోర్ట్స్ అసోసియేషన్ ఈ నెల 29, 30వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. జిల్లాకు చెందిన రాహుల్ మొదటి స్థానంలో నిలిచి పసిడి పతకాన్ని కైవసం చేసుకోగా వైష్ణవి రెండవ స్థానంలో రజతం గెలుచుకుంది. వీరు త్వరలో కర్ణాటకలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తిరుపతివర్మ, ప్రధాన కార్యదర్శి మండ శ్రీనివాస్ సోమవారం తెలిపారు.

## విద్యా.. ఉపాధికి మార్గం

**నేటి పోటీ ప్రపంచంలో తమ ఆలోచనలకు అనుగుణమైన విద్యా కోర్సుల ఎంపికతో పాటు నైపుణ్యానికి అనువైన ఉద్యోగాల వేట కోసం సరైన సమయంలో సమాచారం అందడం అనేది చాలా ముఖ్యమైన అంశం. ఎన్ని నైపుణ్యాలు, ఎన్ని విద్యార్హతలు కలిగి ఉన్నా దానికి సంబంధించిన సమాచారం, దరఖాస్తు చేసే విధానం, ఆఖరు తేదీ వంటి అంశాలు తెలిసినపుడు ఉద్యోగార్థులకు, ఉన్నత విద్యనభ్యసించదలిచే విద్యార్థులకు మేలు జరుగుతుంది. దీనిని గుర్తిస్తూ హైదరాబాద్‌కు చెందిన 'నిర్మాణ్' స్వచ్ఛంద సంస్థ టోల్‌ఫ్రీ నెంబరుతో విద్యార్థులు, ఉద్యోగార్థుల సమస్యలను తీరుస్తోంది. -న్యూస్‌టుడే, బజార్‌హత్నూర్**

### గ్రామీణ విద్యార్థులకు మేలు..

మారుమూల గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈ సేవ చాలా మేలు చేకూర్చేలా ఉపయోగపడుతోంది. ఉన్నత విద్యార్హతలు కలిగి ఉన్నా తగిన ఉద్యోగ సమాచారం సరైన సమయంలో తెలియక నష్టపోతున్నారు. ఈ సేవను వినియోగించుకుంటే ఈ సమస్యను చాలా వరకు అధిగమించవచ్చు.

### హెల్ప్‌లైన్‌లో ప్రత్యక్ష సంభాషణ

నెంబరును ప్రెస్ చేసిన అనంతరం టెలీ కాలర్ అందుబాటులోకి వస్తారు. మనకు కావలసిన, మన సందేహాలకు నిపుణులు తగిన సమాచారాన్ని వెంటనే అందజేస్తారు. ప్రస్తుతం మన విద్యార్హతలు ఏమిటి అనే దాని ఆధారంగా ఎలాంటి ఉద్యోగాలకు అర్హులం లేదా ఇంకా అందుబాటులో ఉన్న ఉత్తమమైన కోర్సులు ఏవి అనే అంశాలను లోతుగా తెలుసుకోవచ్చు.

nirmaan.org Vidya Helpline ...Enlightening Young India
We have only one passion the rise of a great Nation

### టోల్‌ఫ్రీ నెంబరుతో అందుబాటులో..



1800 425 2425 అనే టోల్ ఫ్రీ నెంబరుకు పని దినాలలో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 వరకు ఉచిత కాల్ చేయొచ్చు. మొదట కంప్యూటర్ వాయిస్ ద్వారా వచ్చే సూచనలకు అనుగుణంగా విద్యా.. లేక ఉద్యోగ సమాచారమా అనే ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. అనంతరం అభ్యర్థులు తాము ఏ భాషలో సమాచారం పొందగోరుతున్నారో దానికి అనుగుణంగా ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి.

### వాట్సాప్ ద్వారా..



విద్యా, ఉద్యోగ సమాచారం కోసం 90009 72653 నెంబరుకు వాట్సాప్ ద్వారా పేరు, జిల్లా పేరు, విద్యార్హత వివరాలను పంపాలి. తద్వారా ఆ నెంబరు రిజిస్టర్ అయ్యి సమాచారం నిత్యం ఎప్పటికప్పుడు వాట్సాప్ ద్వారా అందుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన పూర్తి సమాచారం వాట్సాప్‌లో మనకు కనిపిస్తుంది.

**తాంసి, న్యూస్‌టుడే:**

? తాంసి మండలం ఘోట్కురిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లే దారిలో మురుగు కాలువ పూడిక నిండి, మురుగు నిలుస్తోంది.
- రవి, ఘోట్కురి

✔ పరిశీలించి మురుగు కాలువలోని పూడిక తీయిస్తా.
- హమీద్, పంచాయతీ కార్యదర్శి

## అప్పుల బాధతో యువకుడి బలవన్మరణం

**సైదాబాద్, న్యూస్‌టుడే:** షేర్ మార్కెట్‌లో డబ్బులు పెట్టి నష్టపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన మలక్‌పేట ఠాణా పరిధిలో జరిగింది. ఎస్సై సంజీవరెడ్డి కథనం ప్రకారం ఆదిలాబాద్ జిల్లా బరంపూర్‌కు చెందిన మౌనీశ్‌రెడ్డి(32)-శ్రుతి దంపతులు రెండేళ్లుగా మూసారాంబాగ్ శాలివాహన నగర్‌లో ఉంటున్నారు. ఇరువురు ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్నారు. కొన్నాళ్ల క్రితం ఉద్యోగం మానేసిన మౌనీశ్‌రెడ్డి.. షేర్ మార్కెట్‌పై దృష్టి పెట్టాడు. పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టగా, నష్టాలు రావడంతో ఆర్థిక ఇబ్బందులు అధికమయ్యాయి. శనివారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఉద్యోగం ఎర చూపి రూ.2.50 లక్షలు కాజేత

**ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే:** ఉద్యోగం ఇప్పిస్తానని ఆశ చూపి రూ.2.50 లక్షలు దోచేసిన ఘటన వెలుగు చూసింది. ఆదిలాబాద్ టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపిన వివరాల మేరకు శాంతినగర్‌లో నివాసం ఉండే ఎండీ యాకూబ్ తన బంధువు వ్యవసాయ శాఖలో పని చేస్తున్నారని, అతని ద్వారా పలువురు ఉద్యోగాలు పొందారని తాటిగూడలో నివాసం ఉండే ఎండి ఇంతియాజ్‌ను నమ్మించాడు. ప్రస్తుతం వ్యవసాయ శాఖలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఖాళీగా ఉందని ఆ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి అతని వద్ద 2021 మే 21న రూ.2.50 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగ విషయం ఎండీ ఇంతియాజ్ ప్రశ్నించగా కొన్నాళ్లు రేపుమాపు అంటూ వాయిదాలు వేస్తూ వచ్చాడు. అనంతరం శాంతినగర్‌లోని తన ఇల్లు ఖాళీ చేసి చరవాణి సైతం ఆఫ్ చేసుకున్నాడు. ఈ మేరకు బాధితుడు సోమవారం ఫిర్యాదు చేయగా ఎస్ఐ విష్ణుప్రకాష్ కేసు నమోదు చేశారన్నారు. నిందితుడి కోసం గాలిస్తున్నామన్నారు.

## దాడి చేసిన వ్యక్తిపై కేసు

**ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే:** గాంధీనగర్‌లో నివాసం ఉండే మెస్రం ఆకాశ్ పాత గొడవల కారణంగా ఇంద్రానగర్‌లో నివాసం ఉండే పవార్ వినోద్‌పై ఆదివారం రాత్రి దాడి చేసి గాయపర్చాడు. ఈ వ్యవహారంతో ఎలాంటి సంబంధం లేని అదే కాలనీకి చెందిన కామ్రె సంతోష్ అక్కడ నిలబడి చూస్తుంటూ అతనిపై సైతం దాడి చేశాడు. ఈ మేరకు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ విష్ణు ప్రకాష్ కేసు నమోదు చేశారని టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు.

## హత్య కేసులో జామీను ఇచ్చిన ఇద్దరికి జైలు

**ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే:** హత్య కేసులో నిందితుడికి జామీను ఇచ్చిన ఇద్దరికి ఆదిలాబాద్ న్యాయస్థానం సోమవారం మూడు నెలల చొప్పున జైలు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పును వెలువరించారు. ఎస్ఐ వంగ విష్ణువర్ధన్ తెలిపిన వివరాల మేరకు కేఆర్‌కే కాలనీకి చెందిన మెడవార్ చిన్న(22) గతేడాది జూన్‌లో హత్యకు గురయ్యాడు. ఈ హత్య కేసులో నిందితులు అయిన అదే కాలనీకి చెందిన జాదవ్ సంతోష్, పందిగుట్ట అశోక్‌లను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. జి.శివరాం, టేకుల సంజీవ్‌లు వారికి రూ.20 వేల చొప్పున జామీను ఇవ్వగా వారిద్దరికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. బెయిల్‌పై ఉన్న నిందితుల్లో జాదవ్ సంతోష్ వరుసగా కోర్టు పేషీలకు హాజరవుతున్నాడు. పందిగుట్ట అశోక్ మాత్రం పరారీలో ఉండి ఏ పేషీకి హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో అతనికి జామీను ఇచ్చిన వారు రూ.20 వేల చొప్పున ష్యూరిటీ నగదు చెల్లించాల్సి ఉండగా, వారు చెల్లించటం లేదు. దీంతో వారిపై కోర్టు నాన్ బెయిలబుల్ వారంటును జారీ చేసింది. ఆ ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా పైమేరకు శిక్షను విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు.

# ప్రజావాణి.. వినరూ..!

**పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే:** జిల్లా నలు మూలల నుంచి వచ్చిన అర్జీదారులు కలెక్టరేట్‌లో విజ్ఞప్తులు అందజేశారు. పాలనాధికారి రాజర్షిషా, అదనపు పాలనాధికారి శ్యామలదేవి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. 95 అర్జీలు అందజేశారు.

### డబుల్‌బెడ్‌రూంలు ఇవ్వరూ

పట్టణశివారులో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు విద్యుత్తు, నీటిసరఫరా కల్పించి పేదలకు అప్పగించాలని సీపీఐ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి కోరారు. కేఆర్కే, ఆదిత్యనగర్, దుర్గానగర్‌లలో సీసీరోడ్లు, మురుగు కాలువలు నిర్మించాలన్నారు.



సీసీఐని ప్రైవేటు సంస్థకు అప్పగించవద్దని బెల్లూరి గ్రామస్థులు విన్నవించారు. గతంలో ప్రభుత్వరంగ సంస్థకు భూములు అప్పగించామని, ఇప్పుడు మూసివేసిన ఆ సంస్థను ప్రైవేటు అప్పగించవద్దన్నారు.

### కమీషన్ పెంచాలి

క్వింటాకు రూ.300 కమీషన్ పెంచాలని రేషన్ డీలర్లు అన్నారు. హెల్త్‌కార్డులు, ఇన్సూరెన్సు అమలు, గౌరవవేతనం చెల్లింపు వంటి సమస్యలపై పాలనాధికారిని కలిసి విన్నవించారు.




### గోవధశాల పనులు ఆపాలి

మున్సిపల్ పరిధిలోని డంపింగ్‌యార్డులో నిర్మిస్తున్న గోవధశాల పనులు ఆపాలని బంగారుగూడ, అనుకుంట గ్రామస్థులు కోరారు. ఇప్పటికే చెత్త దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామన్నారు.

### మా గ్రామం విలీనం చేయొద్దు

అభివృద్ధికి దూరంగా ఉన్న తమ గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని ఆదిలాబాద్‌గ్రామీణ మండలం పొచ్చర గ్రామస్థులు విజ్ఞప్తిచేశారు. గ్రామాన్ని విలీనం చేస్తే ఉపాధిహామి పథకం, సంక్షేమ పథకాలకు దూరం అవుతామని పేర్కొన్నారు.

# నిరుపేదల ఇళ్లను కూల్చి వేస్తే సహించం



కేసు నమోదైన గంగన్నతో కలిసి మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

**ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే:** ఎంతో కష్టపడి పేదలు నిర్మించుకున్న ఇళ్లను కూల్చి వేస్తే సహించేది లేదని భారాస జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న స్పష్టం చేశారు. ఖానాపూర్ చెరువును ఆక్రమించుకొని నివాసమున్నారని ఇటీవల అధికారులు సర్వే చేపట్టిన ఖానాపూర్, కోలిపుర, తిర్పల్లి కాలనీల్లో సోమవారం ఆయన పర్యటించారు. నిర్వాసితులతో సమావేశమయ్యారు. ఒక్కో రూపాయి జమ చేసి నిర్మించుకున్న ఇళ్లు కూల్చి వేస్తామని చెప్పడంతో మానసిక క్షోభకు గురవుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. కడుపు కాలి రెండు మాటలు అంటే పోలీసులు కేసు నమోదు చేయడం శోచనీయమని రామన్న పేర్కొన్నారు. కేసు నమోదైన ఖానాపూర్ కాలనీకి చెందిన గంగన్నతో మాట్లాడి ధైర్యమిచ్చారు. గత కాంగ్రెస్ హయాంలో ఇందిరమ్మ పేరిట ఇళ్లు నిర్మించుకున్నవారు సైతం ఉన్నారని తెలిపారు. రోకండ్ల రమేష్, అలాల అజయ్, సాజిదొద్దీన్, పండ్ల శ్రీనివాస్, స్వరూపరాణి, విజ్జగిరి నారాయణ, పవన్‌నాయక్, ధమ్మపాల్ పాల్గొన్నారు.

## మార్క్‌ఫెడ్ డీఎంపై చర్యలు తీసుకోవాలని తీర్మానం

**బోథ్, న్యూస్‌టుడే:** ఆదిలాబాద్ మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని సోమవారం బోథ్ పీఏసీఎస్ డైరెక్టర్లు తీర్మానం చేయటం మండలంలో కలకలం రేపుతుంది. గత రబీ సీజన్‌లో సాగు చేసిన జొన్న పంట కొనుగోళ్లలో భాగంగా గుర్తు తెలియని వ్యక్తులకు సంబంధించి 200 క్వింటాళ్ల జొన్నలు బోథ్ మార్కెట్ యార్డులో గుర్తించటం జరిగింది. కొనుగోళ్ల సమయంలో కొన్ని రోజులు మార్కెట్ ఆవరణలో జొన్న సంచులు నిల్వ ఉంచగా, వాటికి సంబంధించిన యజమానులు ఎవరూ రాలేదు. దీంతో స్థానిక తహసీల్దార్, మార్క్‌ఫెడ్ డీఎంల ఆధ్వర్యంలో పంచనామ నిర్వహించారు. అనంతరం గోదాంలో నిల్వ ఉన్న జొన్నలను, ఆరుగురు రైతుల పేరిట కొనుగోళ్లు చేసినట్లు ఆదిలాబాద్‌కు పంపాలని డీఎం నుంచి లేఖ రావటంతో సిబ్బంది సంచులలో నింపి కొనుగోళ్లు చేసి ఆదిలాబాద్‌కు పంపించారు. ఆరుగురు రైతుల పేరిట కొనుగోళ్లు జరిపినట్లు ఆదిలాబాద్‌కు పంపటంపై పీఏసీఎస్ డైరెక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సోమవారం నిర్వహించిన సమావేశంలో తీర్మానం చేశారు.

## ఉత్సాహంగా క్రికెట్ ఎంపిక పోటీలు

**ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే:** జిల్లా కేంద్రం దస్నాపూర్ కాలనీలోని సూపర్ టీ20 స్టేడియంలో సోమవారం నిర్వహించిన అండర్-14 బాలుర జిల్లా స్థాయి క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. ముఖ్య అతిథిగా జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి హాజరై మాట్లాడారు. ఆటలకు పేదరికం అడ్డు రాదని, ప్రతిభ ఉంటే ఏ క్రీడల్లోనూ రాణించవచ్చని, అందుకు భారత పేస్ బౌలర్ సిరాజ్ నిదర్శనమన్నారు. అనంతరం బ్యాటింగ్ చేసి ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఎంపికైన జిల్లా జట్టు ఈ నెల 2న నిర్మల్‌లోని డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించే జోనల్‌స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొంటారన్నారు. సూపర్ టీ20 స్టేడియం యజమానులు దీపక్ అగ్రవాల్, గణేశ్ అగ్రవాల్ ఉన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్.కాంతారావు, పోటీల నిర్వాహకుడు జబాడే రాష్ట్రపాల్, సూపర్ టీ20 స్టేడియం యజమానులు దీపక్ అగ్రవాల్, గణేశ్ అగ్రవాల్ ఉన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, చిత్రంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కాంతారావు, పోటీల కన్వీనర్ రాష్ట్రపాల్

## గురువును గౌరవించి..
## ప్రధానోపాధ్యాయుడి కుర్చీని పక్కనపెట్టి

**బోథ్, న్యూస్‌టుడే:** ఎవరైనా విధి నిర్వహణలో భాగంగా పదోన్నతి పొందితే ఆనందపడతారు. కానీ ధన్నూర్ మండల పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న రావుల శంకర్ రెండు నెలలుగా తన పదవికి దూరంగా ఉన్నారు. సదరు ఉపాధ్యాయుడు ఇటీవల పీఎస్ హెచ్ఎంగా పదోన్నతి పొందారు. అంతకుముందే ఆ పాఠశాలలో అతడి గురువు సురేష్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. తనకు ఓనమాలు నేర్పిన గురువు ముందు ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించాల్సి రావటంతో ఆయన ఇబ్బందికి గురయ్యారు. రెండు నెలల పాటు ప్రధానోపాధ్యాయుడి కుర్చీని త్యజించారు. సోమవారం సురేష్ ఉద్యోగ విరమణ చేయటంతో ఆయనే స్వయంగా తన శిష్యుడు రావుల శంకర్‌ను ప్రధానోపాధ్యాయుడి కుర్చీలో కూర్చోబెట్టారు.



నిరసన చేపడుతున్న హిందూ సంఘాలు

## హిందూ సంఘాల నిరసన

**ఆదిలాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే:** తిరుపతి లడ్డూ తయారీలో అపచారం జరిగిందంటూ జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం ప్రాంగణంలో హిందూ సంఘాలు నిరసన చేపట్టారు. ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ నాయకులు మాట్లాడుతూ తిరుపతి లడ్డూ తయారీలో జరిగిన తప్పులపై సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖను రద్దు చేయాలన్నారు. ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ నాయకులు శివకుమార్, నారాయణ, రవి గిత్తె, శ్రీరాంశర్మ, హన్మాండ్లు, రాజుల్వార్ దత్తాత్రేయ, దినేశ్ ఉన్నారు.

## ఉపాధిహామీ ప్రజావేదికలో బయటపడిన అవకతవకలు

**బోథ్, న్యూస్‌టుడే:** మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లోని గ్రామాల్లో 2023-24 సంవత్సరానికి సంబంధించిన ఉపాధిహామీ పనులపై సోమవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రజావేదికను నిర్వహించారు. 01.04.2023 నుంచి 01.03.2024 వరకు రూ.5.91 కోట్లతో చేపట్టిన 446 పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. అదనపు డీఆర్‌డీవో కుటుంబరావు, ఏపీడీ కృష్ణారావు, ఎంపీడీవో రమేష్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో జీవన్‌రెడ్డి సమక్షంలో గుర్తించిన లోపాలను తనిఖీ బృందం సభ్యులు సమావేశంలో వెల్లడించారు. ఉపాధిహామీ సిబ్బంది రికార్డులను సరిగా ఉంచుకోకపోవటంతో అదనపు డీఆర్‌డీవో అసహనం వ్యక్తం చేశారు. పలు గ్రామాలలో యంత్రాలతో పనులు చేపట్టినట్లు తనిఖీ బృందం సభ్యులు సమావేశంలో ప్రస్తావించగా కూలీలు తామే పనులు చేశామని తనిఖీ బృందం సభ్యులు తనిఖీలు సరిగా చేయలేదని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఘన్‌పూర్ పంచాయతీలో క్షేత్రసహాయకుడు కూలీల వద్ద వారానికి రూ.200 వసూలు చేశారని కూలీలు తనిఖీ బృందం సభ్యులకు రాతపూర్వకంగా సమాచారం అందించారని పేర్కొన్నారు. ఉపాధిహామీ పనులకు వెళ్లకపోయినా వారికి చెల్లింపులు చేయటం ఐకేపీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామపంచాయతీ కార్మికులు, ఓ హోంగార్డు ఉపాధిహామీ పనులకు వెళ్లినట్లు పలు గ్రామాలలో గుర్తించారు. పార్డి-బి గ్రామంలో రాంజీ, సోమన్న అనే వ్యక్తులు చనిపోయినా.. చెల్లింపులు జరిగినట్లు గుర్తించారు. అవకతవకలకు పాల్పడిన పలువురు మేట్ల జాబ్‌కార్డులను తొలగించాలని ఏపీవో జగ్దేరావును ఆదేశించారు. పొచ్చర జలపాతం వద్ద గత అటవీ సిబ్బందికి సంబంధించిన నర్సరీలో 358 మంది పనులు చేయకపోయినా చేసినట్లు చూపి చెల్లింపులు చేశారని తనిఖీ బృందం సభ్యులు సమావేశంలో ప్రస్తావించగా, అటవీ సిబ్బంది తనిఖీ బృందం సభ్యులతో వాగ్వాదానికి దిగారు. పనులకు సంబంధించిన ఆధారాలను సమావేశంలో బయటపెట్టారు. నర్సరీలో పనిచేసిన మహిళలను తీసుకొని వచ్చి జిల్లా అధికారుల ముందు మాట్లాడించారు. చిత్రాలను చూయించారు. దీంతో సమావేశంలో కొంత అలజడి నెలకొంది. పలు గ్రామాలలో నాటిన మొక్కలు సగానికి పైగా లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు.




తనిఖీ బృందం సభ్యులతో వాగ్వాదానికి దిగిన అటవీ సిబ్బంది



# ఏళ్ల కల.. నెరవేరిన వేళ..

డీఎస్సీలో మెరిసిన జిల్లావాసులు

**తాంసి, న్యూస్‌టుడే:** మధ్య తరగతి కుటుంబ నేపథ్యం నుంచి వచ్చి.. వైఫల్యాలను సవాలుగా స్వీకరించి అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నారు జిల్లా వాసులు. డీఎస్సీ ఫలితాల్లో మెరుగైన ర్యాంకులు సాధించారు.



తల్లిదండ్రులతో ప్రవళిక



తల్లిదండ్రులు, భర్తతో సంధ్యారాణి

**పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే:** ఆదిలాబాద్ పట్టణం భుక్తాపూర్ కాలనీకి చెందిన హెడ్ కానిస్టేబుల్ గిన్నెల సత్యమోహన్-విజయ దంపతుల కూతురు ప్రవళిక ఎస్జీటీ విభాగంలో జిల్లా టాపర్‌గా నిలిచింది. 83.53 స్కోర్‌తో జిల్లాలో మొదటి ర్యాంకు సాధించి సత్తా చాటింది. ప్రాథమిక విద్య మొదలుకొని డిగ్రీ, డీఎడ్ జిల్లా కేంద్రంలో పూర్తి చేసి ఎలాంటి శిక్షణ లేకుండా ఘనత సాధించడం విశేషం. నేరడిగొండ మండలం వెంకటాపూర్ రైతు గంగారాం-కౌసల్య దంపతుల కూతురు రాఠోడ్ సంధ్యారాణి స్పెషల్ ఎడ్యుకేషన్ ఎసీజీటీ విభాగంలో 80.63 స్కోర్‌తో జిల్లాస్థాయి మొదటి ర్యాంకరుగా నిలిచారు.

### కరంజివాసికి నాలుగో ర్యాంకు

**భీంపూర్:** కరంజి-టి గ్రామ యువకుడు నల్ల దత్తు స్కూల్ అసిస్టెంటు సోషల్‌స్టడీస్ విభాగంలో జిల్లాస్థాయిలో నాలుగో ర్యాంకు సాధించాడు. పేద రైతు కుటుంబానికి చెందిన ఆయన ఓ ప్రైవేటు కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తుండగా అతడి భార్య కృష్ణవేణి ఇటీవల ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు

**జైనథ్ :** పిప్పర్‌వాడకు చెందిన నెల రోజుల కితం విడుదలైన గురుకుల పరీక్ష ఫలితాల్లో రమేష్ హిందీ పండిత్‌గా ప్రభుత్వ కొలువు సాధించాడు. ఆయన కూతురు వాయిలే ప్రణయ 42వ ర్యాంకు సాధించారు.

**తాంసి:** స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్ విభాగంలో తాంసి మండలం హస్నాపూర్‌కు చెందిన దత్తు, శ్రీదేవి కుమార్తె ఎస్.శ్రీజ 76.34 మార్కులతో జిల్లా స్థాయిలో 6వ ర్యాంకు సాధించింది.

### నర్సయ్య సత్తా..



నర్సయ్య

**బజార్‌హత్నూర్:** డీఎస్సీ ఫలితాల్లో బజార్‌హత్నూర్‌కు చెందిన పురిశెట్టి నర్సయ్య జిల్లా మొదటి ర్యాంకు సాధించారు. స్కూల్ అసిస్టెంట్ తెలుగు, భాషా పండిత్ తెలుగులో సత్తా చాటడంతో ఆయనను స్థానికులు అభినందించారు.

### సత్తా చాటిన రైతు బిడ్డలు

**ఆదిలాబాద్ గ్రామీణం:** ఆదిలాబాద్ గ్రామీణ మండలం యాపల్‌గూడ గ్రామానికి చెందిన కొప్పుల అనిల్ ఎంఏ తెలుగు విభాగంలో జిల్లా స్థాయిలో 2వ ర్యాంకు సాధించారు. అంకోలి గ్రామానికి చెందిన కల్లెం సతీష్, సుంకరి మచ్చెందర్‌లు జిల్లా స్థాయిలో 3వ, 4వ ర్యాంకులు సాధించారు. రైతు కుటుంబానికి చెందిన వీరు వివాహం తర్వాత కూడా పరిస్థితులను అనుకూలంగా మార్చుకొని కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. కల్లెం సతీష్ పదేళ్ల కిందటే తన తండ్రిని కోల్పోయినప్పటికీ ఆ దు:ఖంలోనే కుటుంబ బాధ్యతలు చేపట్టి పట్టుదలతో ఉద్యోగం సాధించారు.

### బోథ్ మండలంలో..

**బోథ్ :** బోథ్ మండలం సొనాల గ్రామానికి చెందిన నల్ల పూర్ణచందర్ రెడ్డి జీవశాస్త్రం విభాగంలో జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. సొనాలకు చెందిన యాల్ల చంద్రమోహన్ రెడ్డి తెలుగు పండిట్ విభాగంలో నాలుగో ర్యాంకు, కౌఠ గ్రామానికి చెందిన సింగడి సాయిచందన గణితశాస్త్రం విభాగంలో జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు, బోథ్‌కు చెందిన బోనగిరి సారిక ఎస్జీటీ విభాగంలో రెండవ ర్యాంకు పొందారు.



పూర్ణచందర్ రెడ్డి



చంద్రమోహన్



సాయిచందన



సారిక

### స్కూల్ అసిస్టెంట్‌గా అంగన్‌వాడీ కుమార్తె..

కప్పర్లకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్త నర్సమ్మ, స్థానిక పాఠశాలలో తాత్కాలిక పద్ధతిలో అటెండర్‌గా పని చేస్తున్న శంకర్ రెండో కుమార్తె జ్ఞానప్రగతి స్కూల్ అసిస్టెంట్ తెలుగు విభాగంలో 76.47 మార్కులు సాధించి 3వ ర్యాంకులో నిలిచింది. తెలుగు భాషా పండిత్‌లో 72.47 మార్కులతో 6వ ర్యాంకు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచింది. పదో తరగతి వరకు కప్పర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంటర్, డిగ్రీ ఆదిలాబాద్ ఓ ప్రైవేట్ కళాశాలలో పూర్తి చేసింది. హిందీ భాషా పండిత్‌లో గిరిగామ్ గ్రామ యువకుడు సాయికృష్ణ 63.73 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచాడు. దేవిదాస్, సునీతల పెద్ద కుమారుడైన సాయికృష్ణ 10వ తరగతి వరకు తాంసి ప్రభుత్వ పాఠశాలలో 2014లో ఇంటర్ ఎంపీసీ తాంసి ప్రభుత్వ కళాశాలలో పూర్తి చేశారు. ఇంటి వద్ద ఉంటూ పోటీ పరీక్షలకు కష్టపడి చదివారు.

**పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే :** ఆదిలాబాద్‌పట్టణం శ్రీనగర్ కాలనీకి చెందిన సుధాం నీరజ్ కుమార్ స్కూల్‌అసిస్టెంటు సోషల్ స్టడీస్ విభాగం తెలుగు మాధ్యమంలో 72.40 శాతం స్కోర్‌తో జిల్లా టాపర్‌గా నిలిచాడు. అమ్మ పంచుపుల ప్రభుత్వ టీచరుకాగా. . నాన్న గజేందర్ చిరువ్యాపారి.



కుటుంబ సభ్యులతో నీరజ్

**తలమడుగు :** సుంకిడికి చెందిన వెంకట్‌రెడ్డి జీవశాస్త్రం విభాగంలో జిల్లా స్థాయిలో 2 వ ర్యాంకు సాధించారు. 4 నుంచి 10వ తరగతి వరకు ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యనభ్యసించారు. ఇంటర్ ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో పూర్తి చేసి, డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో చదివారు.

**బోథ్:** కౌఠకు చెందిన రామెల్లి అధితి సోమవారం వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ విభాగంలో జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. ధన్నూర్‌కు చెందిన చంద్రకాంత్ సాంఘికశాస్త్రం విభాగంలో జిల్లా స్థాయిలో మూడో ర్యాంకు, ఆంగ్ల విభాగంలో జిల్లా స్థాయిలో 16వ ర్యాంకు సాధించారు.







### వ్యభిచార గృహంపై దాడి

**ఆదిలాబాద్ నేర విభాగం:** పట్టణంలోని ఓ కాలనీలో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై మావల పోలీసులు సోమవారం దాడి చేశారు. ఎస్ఐ వంగ విష్ణువర్ధన్ తెలిపిన వివరాల మేరకు.. ఆ కాలనీలో దంపతులు ఇద్దరు కలిసి ఇంటిని అద్దెకు తీసుకొని వ్యభిచార గృహం నడిపిస్తున్నారు. మరో మహిళ ఆ గృహానికి అమ్మాయిలను మభ్యపెట్టి తీసుకెళ్లి వేశ్య వృత్తిలోకి దింపుతోంది. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు దాడి చేయగా వ్యభిచార గృహం నిర్వాహకులు అయిన దంపతులు, అమ్మాయిలను సరఫరా చేసే మహిళ, మరో ముగ్గురు విటులు, బాధితురాలు ఉన్నట్లు గుర్తించారు. బాధితురాలిని మినహాయించి మిగతా ఆరుగురిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

### బెటాలియన్‌లో పచ్చదనం పెంపొందించాలి

**ఆదిలాబాద్ గ్రామీణం:** బెటాలియన్‌లో పచ్చదనం పెంచడానికి కృషి చేయాలని తెలంగాణ పోలీసు పటాలం అదనపు డీజీపీ సంజయ్‌కుమార్ జైన్ సూచించారు. సోమవారం యాపల్‌గూడ 2వ పోలీసు బెటాలియన్‌లో పటాలం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌష్ ఆలం, కమాండెంట్ నితికా పంత్‌తో కలిసి ప్రారంభించారు.

### రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

**గుడిహత్నూర్:** గిరిజన రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ట్రైకార్ ఛైర్మన్ బెల్లయ్య నాయక్ అన్నారు. సోమవారం తోషం పంచాయతీలోని పూనగూడలో ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆయిల్‌మిల్‌ను సందర్శించారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్, గుడిహత్నూర్ సహకార సంఘం ఛైర్మన్ సంజీవ్ ముండే పాల్గొన్నారు.

## సంక్షిప్తం

### మధుసూదన్‌రావుకు జాతీయ సాహితీ కళాసేవా పురస్కారం

**ఆదిలాబాద్ సాంస్కృతికం:** జిల్లా కేంద్రానికి చెందిన విజయ డెయిరీ ఉప సంచాలకులు మధుసూదన్‌రావుకు ఆలూరి కరుణమ్మ స్మారక జాతీయ సాహితీ కళా సేవా పురస్కారం లభించింది. ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీస్ తెలంగాణ ఆధ్వర్యంలో హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని శ్రీశారద కల్చరల్ లైవ్ స్టూడియోలో పురస్కార ప్రదాన కార్యక్రమం నిర్వహించారు.

### అంధకారంలో జైనథ్!

**జైనథ్:** మండల కేంద్రంలో ఆదివారం 11 కేవీ విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. దీంతో మూడు గంటల నుంచి సోమవారం మధ్యాహ్నం మూడు గంటల వరకు జైనథ్ గ్రామంలో అంధకారం నెలకొంది. సోమవారం గుత్తేదారు రావడంతో మరమ్మతులు చేశామని ఏఈ నగేష్, లైన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి తెలిపారు.

### చరవాణి అందజేత

**ఎదులాపురం:** పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన సోహెల్ ఆదివారం రిమ్స్ ఆసుపత్రికి వచ్చాడు. అక్కడ ఏమరుపాటున చరవాణిని ద్విచక్రవాహనంపై ఉంచి మరిచిపోయి ఆసుపత్రిలోకి వెళ్లిపోయాడు. గమనించిన రిమ్స్ ఔట్‌పోస్టు పోలీసులు ప్రభాకర్‌గౌడ్, రవీందర్‌రెడ్డి చరవాణిని మంగళవారం బాధితుడికి అప్పగించారు.

### సెలవుల్లో రెండు గంటలు చదవండి

**పాలనాప్రాంగణం:** దసరా సెలవుల్లో రెండు గంటలైనా ఇంటి వద్ద శ్రద్ధగా చదవాలని పాలనాధికారి రాజర్షిషా విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని రణదివే నగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.90 వేల విలువైన బ్యాగులను 300 మంది విద్యార్థులకు పాలనాధికారి పంపిణీ చేశారు. ఆ పాఠశాలలో చదివే అన్న కామ్లే ఆదిత్య(పదోతరగతి), చెల్లెలు అశ్విని(ఆరోతరగతి) పాలనాధికారి చిత్రాన్ని పెన్సిల్‌తో గీసి ఆయనకు అందజేశారు.

### చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

**గుడిహత్నూర్:** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల మైదానంలో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను ప్రారంభించారు.

### క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలింపు

**ఉట్నూరు గ్రామీణం:** మండలంలోని ఆందోలి గ్రామ సమీపంలో సోమవారం ద్విచక్రవాహనం అదుపుతప్పి ఓ యువకుడు గాయాలపాలయ్యాడు. అదే సమయాన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఉట్నూరు నుంచి ఇంద్రవెల్లికి వెళ్తున్న క్రమంలో ఆ యువకుడిని ఆసుపత్రికి తరలించారు.

### చదరంగం విజేతలు వీరే..

**ఆదిలాబాద్ క్రీడావిభాగం:** జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలలో అండర్-15 బాలబాలికల ఉమ్మడి జిల్లాస్థాయి చదరంగం ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. విజేతల జాబితాను పోటీల నిర్వాహక కార్యదర్శి స్వామి మంగళవారం వెల్లడించారు. బాలికల విభాగంలో ఎ.అద్వైత, ఎ.చైతన్య, ఎస్.లక్ష్మి, రాశి ఖేతాన్, బాలుర విభాగంలో జె.కృష్ణ, మహిత్, పుర్వాన్, యువచారి, రాంచరణ్ ఉన్నారన్నారు.